# శరణాగతి పొందటం ఎలా?

స్వామి యతీశ్వరానంద

పూజ్య స్వామి యతీశ్వరానంద (1889-1966) పరివ్ర పరివ్రాజకులు. శ్రీరామకృష్ణ మఠం, మిషన్‌లకు ఉపాధ్యక్షులుగా వ్యవహరించిన యతీశ్వరానంద నవీన వేదాంత ఉద్యమంలో ప్రసిద్ధులైన అధ్యాత్మవిదులు. శ్రీ రామకృష్ణ పరమహంస ప్రత్యక్ష శిష్యులైన స్వామి బ్రహ్మానందుల దగ్గర మంత్రదీక్ష పొందిన ప్రశిష్యులాయన. యూరోపా, అమెరికాలలో ఆయన అనేక సంవత్సరాలు వేదాంత ప్రచారం చేశారు. మెడిటేషన్ అండ్ స్పిరిచ్యువల్ లైఫ్; 'ఎడ్వంచర్స్ ఇన్ రెలిజియస్ లైఫ్' డివైన్ లైఫ్ మొదలైనవి ఆయన ఆంగ్ల రచనలలో ముఖ్యమైనవి. అత్యున్నత ఆధ్యాత్మిక సిద్ధులు పొంది, యోగపరమైన అంతర్ దృష్టి పరిణతి సాధించిన ఆ ధ్యానమూర్తి అనుభవాల సారాంశమే ఈ వ్యాసం.

**దివ్య శక్తి :** శక్తివంతుల కోసమే ఆధ్యాత్మిక జీవితం. అయితే శక్తి - బలం - అంటే శారీరక బలమే కాదు, మానసిక బలం, ఆధ్యాత్మిక బలం అని కూడా అర్థం. సంయమనం, ఇచ్ఛాశక్తి ఉపయోగించు కోవడం వల్ల అద్భుతమైన అంతరంగ శక్తి సమకూరుతుంది. ఇవన్నీ కాకుండా మరో శక్తి ఉన్నది - అదే దివ్యశక్తి, దైవబలం. నిజమైన భక్తుడు సర్వేశ్వరుడైన భగవంతుడి అండలో తాను ఉన్నానని విశ్వసిస్తూ తద్వారా అఖండమైన శక్తిని పొందుతాడు. మధ్య యుగానికి చెందిన ఉత్తర దేశపు భక్తుడూ వాగ్గేయకారుడూ అయిన సూరదాసు "బృందావనంలోని పురుషోత్తముడైన కన్నయ్య అనుగ్రహం వలన బలహీనుల (నిర్బలుల) బలం రాముడే అని నేను తెలుసుకొన్నాను" అని భజించాడు.

భగవంతుడికి ఆత్మ సమర్పణ చేసుకోవటం అన్నది అద్భుతమైన సాధన. అయితే అది జనం ఊహించినంత తేలిక కాదు. సాధారణంగా మనుష్యులు చెయ్యగలిగింది తమ దిన చర్యల మధ్యలో నిర్ణీత సమయాల్లో భగవంతుడిని మళ్ళీమళ్ళీ ప్రార్థిస్తూ, తమ శరీరం, మనస్సు, ఆత్మలని తమ ఇష్టదేవత పాద పద్మాలకి సమర్పించటం.

భగవద్గీతలో శ్రీ కృష్ణుడు అర్జునుడికి ఈ విధంగా చెప్పాడు. "అంతర్యామి అయిన ఈశ్వరుడు సర్వప్రాణుల హృదయాలలోనూ ఉంటూ, తన మాయ చేత ఒక యంత్రం పైన ఉన్న బొమ్మలలాగ వాళ్ళని తిరిగేటట్లు చేస్తున్నాడు (తోలు బొమ్మలాటవాడు బొమ్మలని కదిపినట్లు) మనఃపూర్వకంగా అతనినే శరణు వేడుకో. అతని అనుగ్రహం వలన అమితమైన శాంతీ, శాశ్వతమైన స్థానమూ పొందుతావు.

ఈ విధంగా అపారమైన జ్ఞాన సంపదని నేను నీకు అందించాను. దానిని పూర్తిగా ఆలోచించి, ఆ తర్వాత నీ ఇచ్ఛాపూర్వకంగా నువ్వు ప్రవర్తించు".

భగవంతుడి నుండి దూరంగా వెళ్లిపోయినపుడు మనం మరింత అహంకార పూరితులమై, ఉన్నత (సాధన) పథం నుండి పతనమవుతాం. మన అహంకారాన్ని కేంద్రంగా ఉంచుకోక, భగవంతుణ్ణి మన చైతన్యానికి కేంద్రంగా చేసుకొని ఆ దైవానికి మనల్ని మనం అర్పణ చేసుకుందాం. ఆ తర్వాత నైతిక, ఆధ్యాత్మిక జీవితం తేలిక అవుతుంది. అసుర సంస్కారాలు ఆవిర్భవించినపుడు మనం ప్రార్థన, తీవ్రమైన ప్రార్థన, అభ్యసించాలి. అపుడు ఒకానొక శక్తి వచ్చి, మనల్ని లేవనెత్తుతున్నట్లు మనం గ్రహిస్తాం.

**అనిశ్చితి అనుగ్రహం :** ఆధ్యాత్మికత దృక్పథంతో ఆలోచిస్తే తీవ్ర (సంశయాలు) అసందిగ్ధమైన పరిస్థితుల మధ్య ఉండటం మంచిది. సాధారణంగా నువ్వు ఆధారపడిన ప్రతీదీ నీ నుంచి తొలగించబడి ప్రాపంచికంగా నీకు ఏ (ఆధారం) ఆసరాలేకుండా ఉండడం చాలా మంచిది. పాత విలువలు, స్నేహాలు, బంధాలు అన్నీ, నువ్వు విశ్వసించినవన్నీ ఆకాశంలోకి అదృశ్యం అవటం ఒక్కోసారి చాలామంచిది అని నీకే తెలుస్తుంది. బాహ్యంగా సాంత్వనని కలిగించేవీ ఇతరులపైన నువ్వు పెట్టుకొన్న నమ్మకాలు అన్నీ భగ్నమవటం మంచిదే. ఎందుకంటే అప్పుడే నువ్వు శాశ్వతమైన మన స్నేహితుడూ, నిజమైన మార్గదర్శి అయిన భగవంతుడివైపు మరలగలవు.

ఇలాంటి అనుభవం చాలా బాధాకరం. అయితే చాలామందికి ఇది అత్యవసరం. లేకుంటే అలాంటి వాళ్ళు భగవంతుణ్ణీ, తమ ఆధ్యాత్మిక గతినీ (యోగాన్ని) మరిచిపోతారు. నీ భవిష్యత్తు గురించి నీకు ఏమీ తెలియదు. క్షణికంగా నశ్వరమయ్యే విషయాల మీద నువ్వు ఆధారపడలేవు. అయితే మనుష్యులు చేసేది ఇదే. ఒక్కోసారి వ్యాధి కన్నా, చికిత్స బాధాకరంగా ఉంటుంది. అయినా ఆ చికిత్సని పొందవలసిందే. వ్యాధి తీవ్రమయ్యేకొద్దీ చికిత్స కూడ సమర్థవంతంగా కొనసాగాలి. పాశ్చాత్య దేశాలలో కామినీ కాంచనాల రోగం ప్రబలమైంది. అందువల్ల బలమైన సూది మందు, ఇతర మందులు దానికి అవసరం. ప్రతీరోగానికీ చికిత్సకీ వ్యాధినిరోధక దశ ఒకటి ఉంటుంది. ఇదే పరిపూర్ణమైన నివారణకి దారితీసే మెట్టు.

---

**నీకు అపకారం చేసినవారు అవమానంతో తలవంచేలా చేయాలంటే**
**దానికి ఒక్కటే మార్గము అపకారికి ఉపకారం చేయడమే. - తిరుక్కురళ్**

నేను అప్పుడప్పుడు భగవంతుడిని భక్తులని పనికిరాని ఆలోచనలనుండి తప్పించటానికి వారికి దుఃఖాన్నీ, ఇబ్బందులనీ ప్రసాదించమనీ, విపత్కర పరిస్థితులలో ఉంచమనీ, గడ్డు సమస్యలు ఎదురయ్యేటట్లు చెయ్యమనీ అర్థిస్తూ ఉంటాను. మాయ ఎంత ప్రబలమైనదంటే అది గతంలో అనుభవించిన దుఃఖాన్ని మరిచిపోయేలా చేసి, ఆ పాత పద్ధతులలోనే జీవించేటట్లు చేస్తుంది. ఎల్లప్పుడూ దైవాన్ని జ్ఞప్తిలో ఉంచుకోవటానికి ఏదో ఒకటి అవసరం.

బాధలన్నీ మనకి శిక్షణనీయటానికే. మన సహజ జంతుప్రవృత్తులు అదుపు చేయబడి, ఆధ్యాత్మిక ప్రయత్నం అన్న అగ్నిలో దహింపబడాలి. ఇనుపకడ్డీ తిన్నగా లేనప్పుడు దానికి సమ్మెటపోట్లు పడాలి. అహంకారపూరితులమై అప్పుడప్పుడు మనం సమ్మెటకి, కొలిమికి మధ్య ఉన్నామన్న సంగతి మరిచిపోతాం. అందువల్ల సమ్మెటపోటు పడినపుడు, "అరే! ఎంత బాధ నాకు సంభవించింది" అని బాధపడతాం. అయితే ఆ స్థానంలోకి వెళ్ళమని నిన్ను అడిగింది ఎవరు?

సంక్షోభం, బాధ కేవలం భౌతికమైన పరిధులలోనే ఉండనవసరం లేదు. ఆధ్యాత్మిక సాధకులు కూడా ఉత్సాహరహితమైన కఠినకాలం ఎదుర్కోవలసి వస్తుంది. ఉత్సాహరహితమైన స్థితిలో - తమకు మొదట్లో కలిగిన తీవ్రమైన ఆధ్యాత్మిక తపన, వ్యాకులత వారికి ఉండదు. ప్రాపంచికులకి కలిగేటంతటి తీవ్రమైన వేదన వీరికి కూడా ఉండవచ్చు.

**దుఃఖానికి ముఖ్య కారణం అహంభావం :** భగవంతుడి నిర్వ్యాజ కృపని మనుషులు తరచు నిర్లక్ష్యం చేస్తారు. లేదా మరిచిపోతారు. తమ శక్తిని అతిగా నమ్మి నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారు. ఇది అహంభావానికి దారితీయవచ్చు. మన గ్రంథాల్లో ఒక హాస్య కథ ఉంది.

ఒక సాధువు ఆశ్రమంలో ఒక చిన్న ఎలుక ఉండేది. ఒకరోజు ఒక పిల్లిదాన్ని పట్టుకోబోయింది. ఆ సన్యాసి అది చూసి జాలిపడి ఆ ఎలుకని పిల్లిలా మార్చాడు. అయితే ఈ కొత్త పిల్లిని కొన్ని కుక్కలు పీక్కుతినటానికి ప్రయత్నించటం చూసి ఆ సాధువు ఆ పిల్లిని కుక్క రూపంలోకి మార్చాడు. ఆ కుక్కని ఒక చిరుతపులి హింసించటం చూసి ఆసన్యాసి దానిని పులి రూపం ధరించేటట్లు చేశాడు. అయితే అది పులి రూపం ధరించగానే అది ఆ సాధువునే చంపాలనుకుంది. ఇది గ్రహించి సాధువు "ఇలా కాదు, నువ్వు తిరికి నీ ఎలుక రూపాన్నే ధరించు" అన్నాడు.

ఆధ్యాత్మిక సాధకుల విషయంలో జరిగేది ఇదే. వాళ్ళపైన దైవకృప కొంత వర్షించి వాళ్ళు కొంతవరకూ పవిత్రులవుతారు. దానివల్ల ధ్యానంలో కొంత ఏకాగ్రతనీ, స్వేచ్ఛనీ సాధిస్తారు. అయితే తర్వాత వాళ్ళు అహంకారపూరితులై, తమని తాము ఎంతోగొప్పగా ఊహించుకుని, తాముసాధించినవి చాలా అతిశయంతో బేరీజు వేసుకొని నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తారు. లేదా ప్రపంచాన్ని దూషించి, దాన్ని సంస్కరించేటంతటి వారవుతారు. అకస్మాత్తుగా ఆ దైవకృప తొలగిపోతే వాళ్ళు ఒంటరి వాళ్ళయి, శూన్యాన్ని ఎదుర్కోవలసి వస్తుంది (బలహీనులవుతారు). నిజంగా ఆధ్యాతిమక జీవితాన్ని అనుసరించే వాళ్ళు అహంభావం లేశ మాత్రంగా, స్వార్థరాహిత్యం అధికంగా ఉండి, ఇతరులపట్ల దయ, ఆర్ద్రత కలిగి ఉంటారన్న సంగతి మనం గ్రహించాలి. దాతలమే కాని యాచకులమవ కూడదు మనం. భౌతికమైన విషయాల దగ్గరకు వచ్చే సరికి దాదాపు అందరూ యాచకులే. ఇతరుల నుంచి వాళ్ళకి ఎన్నో వస్తువులు కావాలి. అయినా కూడా వారిలో స్వార్థపరత్వం ఉంటుంది. ఎంతో తక్కువ అహంకారం మనకు ఉంటే అంత ఎక్కువ శాంతి, ఆనందం ఉంటాయి. మన పని మరింత శ్రేష్ఠంగా జరుగుతుంది.

మీ ఆధ్యాత్మిక అనుగ్రహం గురించి తక్కువ అంచనా వేయవద్దు. మీ బలహీనతల గురించీ, గతంలో జరిగిన పొరపాట్లు గురించీ ఎప్పుడు దిగులు పడుతూ ఉండక, మానసికంగా అప్రమత్తులుకండి. భక్తి మార్గంలో దృఢమైన వివేకం అవసరం. భగవంతుడు మనపై కురిపించే అనుగ్రహం పొందటానికి స్థిరమైన మానసిక అప్రమత్తత అవసరం. శ్రీరామకృష్ణులు చెప్పినట్లు "భగవంతుడివైపు నువ్వు ఒక అడుగు వేస్తే భగవంతుడు నీవైపు పది అడుగులు వేస్తాడు."

**వేదనని ఆధ్యాత్మిక శక్తిలా మార్చు :** నిజమైన భగవద్భక్తులు సంపద కోసం, భౌతికమైన ప్రయోజనాల కోసం ప్రార్థించరు. తమ వేదనని దుఃఖాన్ని తొలగించమని కూడా వాళ్ళు ప్రార్థించరు. తమ దుఃఖాలని భరించే శక్తి కోసమే వాళ్ళు ప్రార్థిస్తారు. రవీంద్రనాథ్ ఠాగూర్ వ్రాసిన ఒక చక్కటి గీతం ఒకటి ఉంది.

"ప్రభూ! నీవు కరుణతో ప్రసాదించిన నీ బరువుని భరించే శక్తి నాకు ఇవ్వు. నీ సేవలో అనివార్యమైన అమిత వేదనని భరించగలిగే భక్తి నాకు ప్రసాదించు. నా హృదయాన్ని ప్రబలమైన వేదనతో నింపు. నీ హస్తాలతో నువ్వే ప్రసాదించే కానుక అయిన ఈ వేదనని కాదనాలన్న కాంక్ష నాకు లేనేలేదు. దానితోపాటు నీ పట్ల భక్తి కూడా నాకు ప్రసాదిస్తే ఆ వేదనే నా చూడామణి. నిన్ను మరిచిపోకుండా ఉండేటట్లుండే ఎంత పని అయినా ప్రసాదించు. ప్రాపంచిక బంధాలలో చిక్కుకోకుండా ఉన్నంతకాలం నువ్వు ఎన్ని కార్యాలయినా నాకు ప్రసాదించు. నువ్వు కోరుకుంటే, నీకు ఇష్టమైనంతగా నన్ను బందించు, కాని నీ ఎడల మాత్రం నా హృదయం తెరిచి ఉంచు. ఏ కారణంగానైనా సరే, నిన్ను మరిచిపోయేలా మాత్రం చెయ్యకు."

ఇలాంటిదే శ్రీకృష్ణునికి కుంతి చేసిన ప్రార్థన ఉన్నది. "జగద్గురూ! అన్ని దిశలనుంచి ఆపదలు కలుగనియ్యి. ఎందుకంటే అవి పునారావృతమయ్యే పునర్జన్మ నుంచి ముక్తి ప్రసాదించే నీ దివ్యదర్శన భాగ్యాన్ని కలిగిస్తాయి.

మనకి వేదనాభరితమైన అనుభవాలు ఎలాగో ఒకలాగ వచ్చితీరతాయి కనుక వాటిని ఉన్నతమైన ఆధ్యాత్మిక జీవితంలో లక్ష్యసాధనకోసం ఉపయోగించుకుందాం. ప్రతి ఒక్కరికీ తన జీవితంలో బాధ, దుఃఖం, అవమానం ఏదో ఒక రూపంలో ఎదురవుతాయి.

**❖ ముందు తనకు తాను మంచిగా మార్చుకోవడమే గొప్ప సేవా కార్యక్రమము ❖**

దానినెవరూ తప్పించలేరు. అవి మనల్ని ఉన్నత ప్రయోజనానికి ప్రోత్సహించేట్లు చెయ్యనివ్వండి. ఆధ్యాత్మిక జీవితానికి సోపానాలలా వాటిని ఉపయోగించుకుందాం. అయితే దీని తాత్పర్యం మనంతట మనం, స్వచ్ఛందంగా దుఃఖాలని కోరి తెచ్చుకోవాలని కాదు. ఇల్లా కొంతమంది ప్రవర్తిస్తారు. సుఖ, దుఃఖాలు రెండింటినీ మనం ఆపేక్షించకుండా, ఆ రెండింటికీ అతీతమైన ఆ భగవంతుణ్ణే మనం అన్వేషించాలి.

దైవకృప మన శారీరక బాధలనీ, దుఃఖాలన్నిటినీ తొలగిస్తుందన్న హామీ ఏమీ లేదు. అయితే ఈ కృప కనుక ఉంటే జీవితంలోని విపత్కర సంఘటనలని సఫలంగా అధిగమించి, దానివలన మనలో ఉన్న కాలుష్యాన్ని తొలగించుకోగలం. ఇది మన అంతరంగంలోని పవిత్రతని, శరణాగతి ప్రవృత్తిని పెంపొందింప చేస్తుంది. దుఃఖాల వలన మరింత స్పష్టమైన జ్ఞానం, మరింత స్థిరమైన భక్తి కలిగితే మనం దుఃఖాల వలన దైవానుగ్రహ లబ్ధి పొందినట్లే. జీవితాన్ని పరిశీలించినకొలదీ, దైవకృప అన్నది మన కలతలని తొలగించడానికే ఉద్దేశించబడలేదు అనే సంగతి నాకు మరింతగా అర్థమవుతోంది. అయితే అది భక్తుడికి పరీక్షలనీ, సమస్యలన్నిటినీ ఎదుర్కొనేందుకు అవసరమైన అద్భుతమైన నిశ్చల మనస్సునీ, బలాన్నీ ప్రసాదిస్తుంది. అత్యంత బాధాకరమైన పరిస్థితులలో కూడా మనశ్శాంతి కలిగించే భగవంతుడి సమక్షంలో ఉన్న భావననీ, పవిత్రతనీ కలగచేస్తుంది. నిజమైన శాంతి నిద్రలాంటిదికాదు. సమస్యలు, సంఘర్షణల మధ్యలో నిశ్చలత్వం ప్రసాదించి, మరింత అపరి మేయమైన వాస్తవికతతో సంబంధం కలిగించేదే నిజమైన శాంతి. జీవితంలోని సమస్యలనుంచి పారిపోయే వాళ్ళు తమనితాము మరింత బలహీనపరచుకుంటారు. ఎల్లప్పుడూ సుఖాన్నే కోరుతూ, తమ కర్తవ్యాలని నిర్వర్తించని వారికి అభివృద్ధి ఉండదు. వాళ్ళు ఆధ్యాత్మిక పరిపూర్ణతని పొందలేరు. సదావర్షించే భగవంతుడి కృపని అలాంటి వాళ్ళు ఉపయోగించుకోలేరు.

మనపై కురిసిన దైవకృపని సరిగా ఉపయోగించుకుందాం. సమయం చాలదనీ, ఎన్నో అసౌకర్యాలు ఉన్నాయనీ ఫిర్యాదు చెయ్యకుండా మనికి ఉన్న కాలాన్నీ, అవకాశాలనీ శ్రేష్ఠమైన పద్ధతిలో ఉపయోగించుకుందాం. భగవత్ సాక్షాత్కారానికి కృషిచేద్దాం. మన ఆధ్యాత్మిక పర్యవసనాన్ని మరపించే ప్రాపంచిక వస్తువులకోసం వెంపరలాడకుండా మరింత భగవత్కృపకోసం, మరింత దైవభక్తి కోసం ప్రయత్నం చేయాలి. భగవంతుడి వైపు దూసుకుపోయే మనఃస్థితిలో మనం ఎప్పుడూ ఉండాలి.

**కర్మ, దైవకృప :** కొన్ని విధాలైన కర్మలు దుఃఖం (బాధలు) ద్వారానే సాధించాలి. అందువల్ల దుఃఖం ద్వారా కర్మ పరిపాకం జరిగితే ఒక విధంగా మనం హాయిగా ఊపిరి పీల్చుకోవాలి. ఎందువల్లనంటే దుఃఖం వల్ల మన కర్మ తీవ్రత తగ్గిపోతుందన్న మాట. దుఃఖం వల్ల కలిగిన నిస్సహాయతని ఆత్మార్పణ చేస్తూ దైవ కృపకోసం, ఆధ్యాత్మికత కోసం మరింతగా ఉపయోగించుకోవచ్చు. సుఖ, దుఃఖాలలో, జీవన్మరణాల్లో భగవంతుడు సదా మన ఆంతరంగిక సఖుడే. మన ఆత్మల పరమాత్మ, మన జీవితాలకి జీవం.

"శరీరంలో వసించటానికి మనం కట్టవలసిన పన్నులే వ్యాధులు" అని శ్రీరామకృష్ణులు అనేవారు. ఒక్కోసారి ఈ పన్నులని పెద్ద మొత్తాలలో చెల్లించవలసి వస్తుంది. అయితే కొంతమందికి మినహాయింపు, రాయితీ ఉండవచ్చు. తను కేన్సర్ వ్యాధితో భాధపడుతున్న చివరి రోజుల్లో శ్రీరామకృష్ణులు తరచు ఈ విధంగా అనటం వినిపించేది. "శరీరం బాధపడనీ కానీ ఓ మనసా! నువ్వు మాత్రం ఆనందంలో ఉండు!"

వేగంగా పరుగెత్తకుండా ముందుకు సాగు. వేగంగా పరుగెత్తటానికి ప్రయత్నిస్తే చక్రవడ్డీతో సహా (పన్ను) చెల్లించవలసిరావచ్చు. భగవంతుడి సాక్షాత్కారం నిస్సందేహంగా మన లక్ష్యమే. అయితే దీనిని ఆధ్యాత్మిక కృషి వల్లనే కాకుండా ఉచితమైన, తగిన పద్ధతిలో సాధించాలి. అనుచితం, అనవసరం అయిన పనులని అన్ని విధాలా మనం విడవాలి. అందుకని అంతరంగంలోని ఆశయం, బాహ్యక్రియ అనే ఈ రెండు విషయాలపట్ల జాగ్రత్తగా ఉండాలి. నీ కర్మని పరిపక్వం చేసుకుంటూ, నెమ్మదిగా, స్థిరంగా పయనించు. మానసికంగా దైవంతో లయం చెందటానికి తగిన మనఃస్థితి కలిగి నువ్వు చేసే క్రియపట్ల అప్రమత్తుడవై ఉండు. భావనలోనూ, క్రియా శీలకంగానూ కూడా మనల్ని మనం సంస్కరించుకోవాలి.

తమ ఆధ్యాత్మిక ఆదర్శానికీ, ప్రాపంచిక జీవితంలో ఎదుర్కొనే కఠోరసత్యాలకూ మధ్య ఉన్న వైరుధ్యంవల్లనే చాలామంది దుఃఖితులవుతారు. అయితే ఇలా వ్యధచెందటం హానికరమైనది కాదు. అంతరంగ ఆధ్యాత్మిక పరిస్థితిలో అవగాహన సర్దుబాటు కలుగచేస్తే ఇది మనకి మంచిదే. ప్రపంచంలో ఉన్నా తను ప్రపంచానికి చెందిన వాడిని కాదన్న అవగాహన (దీనిద్వారా) క్రమేణా కలుగుతుంది.

ఒక విధంగా మనకి యోగ్యమైనదే మనకు లభిస్తుంది. ఒక వస్తువుని మనం కోరుకుంటాం. అది లభిస్తుంది. అయితే ఆ వస్తువుతో విడదీయలేని సంబంధం ఉన్న మంచీ, చెడూ కూడ దానితోపాటు సంక్రమిస్తాయి. మనం కొన్ని విధాలైన ఆనందాల్ని అభిలషిస్తాం. కాని స్వామి వివేకానంద చెప్పినట్లు, "శిరస్సున ముళ్ళ కిరీటాన్ని ధరించి, ఆనందం మనిషి ఎదుట

సాక్షాత్కరిస్తుంది. లౌకికమైన కోరికల తృప్తి కోరుతాం మనం. మనం కోరుకునేది మనం పొందుతాము. అయితే దానితో అంటిపెట్టుకుని ఉన్న కలతని కూడా పొందుతాం. మన గతంతోపాటు వర్తమానంలోని ప్రాపంచిక కోరికల ఫలితం మన వర్తమాన స్థితి. వీలైనంత వరకూ కోరికలు లేకుండా ఉండటానికి ప్రయత్నిద్దాం. మనం కల్పించుకున్న పరిస్థితులతో సర్దుకుపోతూ, వాటిని త్యజించటానికి ప్రయత్నిద్దాం. మన అదృష్టాన్ని మనమే సాధిద్దాం. మన కర్మని పరిపక్వం చేసుకుంటూ దైవంపై ఆధారపడదాం.

అప్పుడు ఈప్రపంచం ఒక శిక్షణాస్థలం అవుతుంది. దాని ద్వారా మనం దైవాన్ని చేరుకోగలం. అప్పుడూ బాహ్యంగా ప్రపంచంలో ఉన్నా మనం ప్రపంచానికి చెందం, మనం ఎక్కడ, ఏ పరిస్థితులలో ఉన్నా భగవంతునికి చెందినవారమవుతాం.

**దివ్యజనని లీల :** ప్రతీదీ దివ్యజనని లీల మాత్రమే. ఆమె ఎన్నో రూపాలలో వస్తుంది. గురు–శిష్యులలాగ శత్రువు–స్నేహితులలాగ. మరి మనం మన పాత్రని వీలైనంత సమర్థవంతంగా పోషిస్తూ మనం అభినయించే లీలని నిర్లిప్తతతో వీక్షిద్దాం. మన చుట్టూతా మనం ఏం చూసినా మనకి ఏం జరిగినా అదంతా దివ్యజనని వ్యక్తం చేసే ఆమె లీల, ఆమె ఆనందం మాత్రమే. ఆమె ఒక్కోసారి చిలిపిచేష్టలు చేస్తూ, మనుష్యుల హృదయాలతో ఆడుకుంటూ వేదనని, సుఖాన్ని కలిగిస్తూ ఉంటే ఆ వినోదం చూసి ఒక్కోసారి భక్తుడు, "ఓ పిచ్చిదానా! ఏవిటమ్మా నువ్వు చేసే ఈ పనులు?" అని ప్రశ్నిస్తాడు. ఈ సంపూర్ణ విశ్వక్రమంలో కొన్నిసార్లు మనకి ఒక తీరు, హేతువు కనిపించవు. అయితే ఉన్మాదం, క్రూరత్వం, సుఖదుఃఖం గల ఈ విశ్వక్రమమంతా ఆ దివ్యజనని లీలా వినోదంలో వ్యక్తమవుతున్న చిలిపి ఉత్సాహమే. మనం కూడా ఆమె లీలను చూసి ఇదంతా 'నాటకం' అని గ్రహించి, ఆనందిస్తూ మనవంతు పాత్రలని అభినయించాలి. అయితే మనకి దానితో ఏమీ సంబంధం లేదని, అదంతా ఆ లీలలోని వినోదం మాత్రమే అని గ్రహించాలి.

శ్రీరామకృష్ణులు పాడిన గీతాలు ఎన్నో ఈ విశ్వగతి యొక్క పరంపరాగత చిహ్నానికి సంకేతాలు. (వీటిలో చాలా గీతాలు రామ్‌ప్రసాద్ మొదలైన వంగదేశపు సాధువులు రచించినవి) అయితే ప్రాపంచికుల అపరిణతములైన (మొరటు) మనస్సులు వాటిని అనాగరికంగానే భావించడంవల్ల ఆ గీతాల అంతరార్థాన్ని కనుక్కోలేరు. అవి సూచించే గూఢార్థం అద్భుతంగా ఉండి, మాటలతో వ్యక్తపరచలేని నిజాలని దృష్టిని ఆకట్టుకొనేటట్లు ప్రకటిస్తాయి. దివ్యజనని గాలి పటాలు ఎగర వేయటం అనే అర్థం వచ్చే ఒక గీతాన్ని శ్రీరామకృష్ణులు ప్రత్యేకంగా అభిమానించేవారు. మనందరం అమ్మవారు ఆకాశంలో ఎగరవేసే గాలి పటాలలాంటి వాళ్ళం. తప్పించుకొనే అవకాశం లేకుండా వేర్వేరు దారాలకి కట్టి ఉన్నాం మనమంతా, తాని బాగా తెలివైన గాలిపటాలు కొన్ని దారం తెంచుకుని స్వేచ్ఛగా ఎగిరిపోతాయి. మళ్ళీ తిరిగిరాకుండా. తానే వాటిని దారాలకి కట్టినా ఇలా స్వేచ్ఛగా ఎగిరిపోయిన వాటిని చూసి ఆనందాతిరేకంతో దివ్యజనని చప్పట్లు చరుస్తుంది. అందువల్ల ఈ మాత వినోదం కోసం దృగ్గోచర ప్రపంచానికి బంధింపబడ్డ మనం ఏం చెయ్యాలంటే మన దారాన్ని తెంపుకొని మనం ముక్తులమవ్వాలి. అమ్మ కూడా మన స్వేచ్ఛని చూసి ఆనందంతో పొంగిపోతుంది. లేదంటే అంతంలేని సుఖాలు, వేదనలు, సంతృప్తి, అసంతృప్తి – వీటితో నిండిన ఈ నాటకం అనిశ్చితంగా సాగుతూనే ఉంటుంది. మాత ఈ లీలలని కొనసాగిస్తూనే ఉంటుంది. మాతకి ఇది ఎక్కువగా వినోదం కలిగించే సాధారణ దైనిక కార్యక్రమమైన చిలిపి చేష్ట. మన దృక్పథం నుంచి చూస్తే మనకి అమిత దుఃఖం కలిగించి బంధనాలు కలిగిస్తుంది.

వ్యక్తిగతంగా అల్పమైన నీ అభీష్టాన్ని ప్రక్కకి తోసివేసి దివ్యమాత ఉద్రిక్త నృత్యాన్ని నువ్వు నర్తించాలి. దీనిలో తమాషా ఏమిటంటే మనకు కలిగే మానసిక ప్రేరణలెన్నో స్వయంగా మన సంకల్పం వలననే ఉదయిస్తున్నాయనుకుంటాం. మన బానిసత్వ నిజస్వభావం గురించి మనకు సరైన అవగాహన ఉండదు. ఈ అద్భుతమైన విశ్వవ్యాప్త నృత్యంలో మనం పాలుపంచుకొనేటప్పుడు అది కేవలం నాటకం అని, మరేదీకాదని, మనం సాక్షులం తప్ప మరేమీ కామని మన లోతైన అంతరంగంలో గ్రహించాలి. వాటితో తాదాత్మ్యం చెందకూడదు. మనది అని అనుకునే మన వ్యక్తిత్వం ఆ విశ్వం యొక్క వ్యక్తీకరణే. అయితే ఆ నృత్యం ప్రారంభించి నాయకత్వం వహించే ప్రధాన తత్వం అయిన దివ్యజనని నుంచి వేరు పరచుకుని దుఃఖిస్తాం.

పాత్రలో బంగాళాదుంపలని ఉడకపెడితే అవి కూడా హాస్యాస్పదమైన 'భంగిమ'లతో నృత్యంచేస్తాయి. మనం సరిగ్గా ఆ బంగాళాదుంపలాంటివాళ్ళమే. అవి కూడా ఆలోచించ గలిగితే తాము కూడ స్వేచ్ఛగా తమ ఇష్టప్రకారం నృత్యం చేస్తున్నామని అనుకుంటాయి. తాము నృత్యం చేయించబడుతున్నామని అవి గ్రహించవు. (ఇది స్వేచ్ఛ ఉన్నది అని అనుకునే మన పరిస్థితే) ఈ వాస్తవాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాలి. సరైన మార్గంలో అభివృద్ధి చెందటానికి ఇది ఎంతో ఉపయోగ పడుతుంది.

**❖ వాంఛాతీతుడవైతే వాంఛ ఫలిస్తుంది ❖**

వికాస్ గ్రాఫిక్స్, సత్తుపల్లి. ఫోన్ : 282051